# ఎవరో చెప్పాలా?

-వాణిశ్రీ

చీకటి పడింది. గోడ గడియారం ఏడు గంటలు కొట్టింది.

"మనోహర్! నాన్న ఇంకా ఇంటికి రాలేదు. ఆఫీసుకు ఫోన్ చేసి కనుక్కో" అన్నది కొడుకుతో.

"వస్తార్లేమ్మా! నీకంతా కంగారు. ఎక్కడో ట్రాఫిక్ జామై వుంటుంది" అన్నాడు మనోహర్.

"ఎంత ట్రాఫిక్ జామైతే మాత్రం గంటల తరబడి వుంటుందా?" అన్నది పార్వతి.

"గంటల తరబడి ఏంటమ్మా? పూటల తరబడి వుంటుంది. ఎవరో రాస్తారోకో చేస్తారు, ఊరేగింపులు జరుగుతుంటాయి. అటువంటి వాటి మధ్య ఇరుక్కున్నామా ఇక నరకమే. సిటీ చాలా మారిపోయింది. లక్షలకొద్దీ కార్లు, ఆటోలు తిరుగుతున్నాయి. బస్సులకు రోడ్లు చాలడంలేదు" అన్నాడు మనోహర్.

ఇంతలో శ్రావణి లోపలకు వచ్చింది.

"శ్రావణీ! నాన్న ఇంకా రాలేదు. ఆఫీసుకి ఫోన్ చేసి కనుక్కోరా అంటే వీడు కూర్చున్న చోటు నుంచి కదలడంలేదు. ఎంత బద్ధకమో వీడికి. నువ్వైనా ఫోన్ చేయి" అన్నది పార్వతి.

"నాన్న ఒక సెల్‌ఫోన్ కొనుక్కోవచ్చుగా! ఏ క్షణంలో ఎక్కడుందీ తెలుసుకోవచ్చు. నీకు కంగారు కూడా ఉండదు" అంది శ్రావణి.

"ఆ.. నా మాట వింటారూ? 'నాకెందుకే సెల్‌ఫోన్, అనవసరంగా డిస్ట్రబెన్స్' అంటారు."

శ్రావణి తండ్రి ఆఫీసుకు ఫోన్ చేసింది.

"అమ్మా! రింగవుతుంటే ఎవరూ ఎత్తడం లేదే?" అంది.

ఇంతలో రఘురామ్ లోపలకు రానే వచ్చాడు. పార్వతి ముఖం కళకళలాడింది. ఆమెలో ఆందోళన మాయమైంది.

"హమ్మయ్యా వచ్చారూ! మీ కోసమే ఫోన్ చేయిస్తున్నాను. ఆలస్యమైతే ఫోన్ చేసేవారేగా? అదీలేదు, కంగారుపడి చస్తున్నా" అన్నది పార్వతి.

"ఈరోజు కొత్తగా కంగారుపడుతున్నావా ఏం? పెళ్లయిన దగ్గర్నుంచీ నీకు కంగారే" అన్నాడు రఘురామ్ నవ్వుతూ.

"మీకు అలాగే వుంటుంది. పొద్దున్నే అంతా వెళ్లిపోతారు. సాయంకాలం వచ్చేవరకు బిక్కుబిక్కుమంటూ కూర్చుంటారు. నా బాధ మీకేం తెలుస్తుంది?" అన్నది పార్వతి.

"బిక్కుబిక్కుమంటూ కూర్చుంటున్నావా? దర్జాగా టీవీ సీరియల్స్ చూస్తూ కూర్చుంటున్నావు. నాకు తెలియదనుకోకు" అన్నాడు రఘురామ్. పార్వతి మూతి మూడు వంకర్లు తిప్పింది.

రఘురామ్ స్నానం చేసి వచ్చి భోజనానికి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు. మనోహర్, శ్రావణి కూడా భోజనం చేయడానికి రెడీ అయ్యారు. పార్వతి ముగ్గురికీ వడ్డిస్తోంది.

"ఏమోయ్! నాకు గుంటూరు ట్రాన్స్‌ఫర్ అయిందోయ్. ఆర్డర్ చేతికి అందేసరికి లేటైంది" చెప్పాడు రఘురామ్.

"గుంటూరా?" అన్నది పార్వతి.

శ్రావణి, మనోహర్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయోమయంగా తండ్రివైపు చూసారు. ఏదో దుర్వార్త వింటున్నట్లుగా ఉన్నాయి వాళ్ల ఫీలింగ్స్.

"గుంటూరేం బాగుంటుంది నాన్నా?" అన్నాడు మనోహర్.

"ఏం?"

"మంచి ఏసీ థియేటర్స్‌లేవు, పార్కులు లేవు, హుస్సేన్‌సాగర్, నెక్లెస్ రోడ్డులాంటివేవీలేవు" విరక్తిగా అన్నాడు మనోహర్.

"అవన్నీ ఎందుకురా? నువ్వు చదువుకోవడానికి మంచి కాలేజీలున్నాయి చాలదా?" అన్నాడు రఘురామ్.

శ్రావణి మాత్రం ముఖం మాడ్చుకుంది. ఆమెకు తండ్రి చెప్పింది మింగుడుపడడంలేదు.

"పార్వతీ! నీకిక కంగారు ఉండదోయ్. ఆఫీసుకి దగ్గర్లోనే ఇల్లు తీసుకుందాం. హాయిగా నడిచిపోయి రావచ్చు. ఇప్పట్లా వెళ్లడానికి గంటన్నరా, రావడానికి రెండుగంటల ప్రయాణం తప్పుతుంది. ఏమంటావు?" అన్నాడు రఘురామ్ నవ్వుతూ.

"నేనేమంటాను?" అన్నది పార్వతి పిల్లలవైపు చూస్తూ.

వాళ్లకి సిటీ వదిలి పెట్టి వెళ్లడం ఇష్టంలేదనే సంగతి వాళ్ల ముఖాలు చూస్తూనే కనిపెట్టింది.

★★★

మర్నాడు రఘురామ్ గుంటూరు బయల్దేరి వెళ్లాడు. మళ్లీ శనివారం రాత్రికి వస్తాననీ, ఆదివారం ఉండి సోమవారం ఉదయం వెళ్తాననీ, అక్కడ మంచి ఇల్లు దొరికేవరకూ వెళ్లొస్తుంటాననీ చెప్పాడు.

"అమ్మా! నాకు గుంటూర్లో చదవడం ఇష్టంలేదమ్మా. ఎప్పుడన్నా పెళ్లిళ్లకి వాటికి వెళ్లినప్పుడు చిరాకుగా వుంటుంది. ఒకటే ఉక్కపోత. చెమట కారుతూ వుంటుంది" చిరాకుగా అన్నాడు మనోహర్.

"ఇక్కడ అలవాటు పడ్డవాళ్లకి అలాగే వుంటుందిలేరా. నాలుగురోజులుంటే అదే అలవాటైపోతుంది. నేను, మీ నాన్న గుంటూర్లో పుట్టి పెరగలేదా? ఉండే వాళ్లంతా ఉండడంలేదా" అన్నది పార్వతి.

"నీకు ఎక్కడైనా ఒకటేలేమ్మా. ఇంట్లో ఉండేదానివి. బైటకు వెళ్లి తిరిగొస్తే తెలుస్తుంది" అన్నాడు మనోహర్ చిరాకు పడుతూ.

"అమ్మా! నేను, తమ్ముడు ఇక్కడే ఉంటాం. నాకు ఎటూ ఉద్యోగం ఉంది కాబట్టి ఇబ్బంది ఏమీ వుండదు. నువ్వు నాన్నకి వండి పెట్టడానికి గుంటూరుకు వెళ్లు" అన్నది శ్రావణి.

"ఇవన్నీ నాకు చెప్తావెందుకు? మీ నాన్నతో చెప్పు. నా ఇష్టమా ఏంటి?" అన్నది పార్వతి.

శ్రావణి మాట్లాడలేదు.

"ఔనమ్మా... అక్క చెప్పింది బాగుంది. నాకు ఇక్కడే బావుంటుంది" అన్నాడు మనోహర్.

"శనివారం నాన్న వస్తారుగా. అప్పుడు మాట్లాడదాంలే" అంది పార్వతి.

రఘురామ్‌కి గుంటూరు ట్రాన్స్‌ఫర్ అవుతుం

దనీ, మళ్లీ అక్కడికి వెళ్లిపోతామని పార్వతి ఊహించలేదు. సిటీకి దూరంగా కాలనీలో మంచి ఇల్లు కట్టుకున్నారు. చెట్లు, పూలమొక్కలు పెంచుకున్నారు. ఇవన్నీ వదిలి వెళ్లడానికి బాధగానే వుంది.

మూడొంతుల సర్వీసు అయిపోయాక ఈ ట్రాన్స్‌ఫర్లు ఏమిటో అని బాధపడింది పార్వతి. తను ఎలాగో సర్దుకుపోతుంది. పిల్లలే తలకిందులైపోతున్నారు అనుకుంది.

★★★

శనివారం రాత్రి ఎనిమిదింటికి వచ్చాడు రఘురామ్.

"ఇంటర్‌సిటీ చాలా రష్‌గా ఉందోయ్ పార్వతీ. తెనాలిలోనే చాలావరకు నిండిపోయింది. రిజర్వేషన్ చేయించుకుంటే పోయేది. వచ్చేవారం ఆ పని చేయాలి" అన్నాడు రఘురామ్.

"వారం వారం ఈ తిరుగుడు ఎన్నాళ్లు తిరుగుతారు? అక్కడ మీ ఆఫీసుకు దగ్గర్లోనే ఇల్లు చూడండి" అన్నది పార్వతి.

"చూస్తున్నా. బ్రాడీపేటలోగానీ ఏటి అగ్రహారంలోగానీ చూడమని చెప్పా. మంచి ఇల్లు దొరకాలి కదా" అన్నాడు.

"ఏమిటో ఎన్నడూలేనిది మీకు ట్రాన్స్‌ఫర్ గొడవ. పిల్లలు దిగులుపడుతున్నారండీ"

"ఏం?"

"చిన్నప్పటినుంచీ పెరిగిన కాలనీ కదా. వాళ్లకి ఫ్రెండ్స్ అంతా ఇక్కడే ఉంటారు. అందర్నీ వదిలి వెళ్లాలంటే బాధకదా?" అన్నది పార్వతి.

"నిజమే. మనమేం చేస్తాం?"

"ఎవరితోనైనా రికమండేషన్ చేయిస్తే మీ ట్రాన్స్‌ఫర్ ఆగుతుందేమో ప్రయత్నించకూడదా?"

"అంత అవసరం ఏమొచ్చింది? పైరవీలు చేయిస్తే ఇక్కడ నాకు చాలా లాభం ఉందనీ, లంచాలు మేస్తున్నాననీ అనుకుంటారు. ఎందుకొచ్చిన గొడవ?"

"అనుకుంటే అనుకుంటారు. మన సౌకర్యం చూసుకోవాలికదా?"

"అనుకోవడంకాదు. పాతికవేలు ఇవ్వు, యాభైవేలు ఇవ్వు అని అడుగుతారు. ఎక్కడ తెచ్చిస్తాం? అంత డబ్బు ఖర్చు పెట్టి ట్రాన్స్‌ఫర్ ఆపించుకోవాల్సిన అవసరం ఏమిటి? ఉద్యోగికి దూరభారం లేదన్నారు. నాకేం బాధలేదు. గుంటూరులో ఇల్లు లేదన్న మాటేగానీ పుట్టి పెరిగిన ఊరు. చుట్టాలంతా అక్కడే ఉన్నారు. ఇంకేంటి?" అన్నాడు రఘురామ్.

"నాకూ బాగానే వుంటుంది. కానీ పిల్లలే బాధపడుతున్నారు. ఇక్కడ నుంచి గుంటూరు వెళ్లడం వాళ్లకిష్టంలేదు"

"జీవితంలో ఇష్టంలేని పనులెన్నో చేయాల్సి



వుంటుంది. నాకూ ఈ ఉద్యోగం చేయడం ఇష్టంలేదు. చాలీచాలని జీతం, ప్రతినెలా ఫస్ట్ తారీకు కోసం ఎదురు చూడడం, ఆ జీతం చాలక అప్పులు. ఇప్పుడంటే వేలల్లో జీతాలొస్తున్నాయిగానీ అప్పుడంతా వందల్లోనేగా! ఎంత బాధపడేవాళ్లం. అందుకే ఏదైనా వ్యాపారం చేయాలనేది నా జీవితాశయం. మనకి పెట్టుబడి లేదు. చేయలేకపోయాను. ఏం చేస్తాం?'' పరిస్థితులకు తగ్గట్టుగా బ్రతకడం అలవాటు చేసుకున్నాము. తప్పదు మరి'' అన్నాడు రఘురావ్.

''అది సరేనండీ. పిల్లలకేం తెలుస్తుంది?''

''తెలుసుకుంటారు. మనం అనుకున్నవన్నీ జరగవనీ, అనుకోనివి జరుగుతాయని.''


''శ్రావణికి ఉద్యోగం ఉందికదా. మనోహర్ తనూ ఉంటామని అంటున్నారండీ'' అన్నది పార్వతి.

''ఊ'' అన్నాడు రఘురామ్.



## శ్రియ తెలివి

'శివాజీ'లో హీరోయిన్ శ్రియ అయితే అందులో ఓ ఐటమ్ నంబర్ చేసింది నయనతార. ఇప్పుడు నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న 'తులసి'లో శ్రియ ఐటమ్ నంబర్ చేయడాన్ని విశేషంగా చెప్పుకుంటున్నారు సినీజనాలు. వెంకటేష్‌తో కలిసి ఈ సినిమాలో స్టెప్పులేస్తున్న శ్రియ 'శివాజీ' తర్వాత తమిళంలో అవకాశాలు వచ్చిపడుతున్నా సినిమాల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరిస్తోందిట. ఏది ఏమైనా శ్రియ తెలివితేటలను అభినందించాల్సిందే మరి.




గంభీరంగా ఉండిపోయాడు. ఔననిగానీ, కాదనీ అనలేదు.

భర్త ఉద్దేశ్యం ఏమిటో పార్వతికి తెలియలేదు.

తను కూడా రెట్టించలేదు. మళ్లీ అడిగితే ఆయనకి కోపం వస్తుందేమోనని వూరుకుంది.''

***

ఆదివారం రాత్రి డిన్నర్ పూర్తయ్యాక రఘురామ్ మర్నాడు ఉదయమే ఆరు నలభైకి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరే ఇంటర్‌సిటీకి వెళ్లడానికి అన్నీ సర్దుకుంటున్నాడు.

''అమ్మా! నాన్నకి ఆ విషయం చెప్పావా?'' అడిగింది శ్రావణి.

''ఏ విషయమే?''

''అదే! నేను, తమ్ముడు ఇక్కడే ఉండిపోవడం గురించి'' అంది.

''చెప్పానే''

''ఏమన్నారు?''

''ఏమీ అనలేదు. ఊ కొట్టి ఊరుకున్నారు. నేను మళ్లీ ఆ ప్రస్తావన ఎత్తలేదు'' అంది పార్వతి.

''మళ్లీ చెప్పి చూడమ్మా''

''నువ్వే అడగరాదూ? భయం ఎందుకు? మళ్లీ మళ్లీ నేనే అడుగుతుంటే మీ నాన్నకి కోపం వస్తుంది'' అంది పార్వతి.

''నాకేం భయం. అడుగుతాను. నువ్వు కూడా రా'' అన్నది శ్రావణి.

''నేనెందుకు? ఏం భయం లేదన్నావుగా?'' నవ్వుతూ అంది పార్వతి.

''రమ్మంటుంటే'' అని తల్లి చేయి పట్టుకుని లాక్కెళ్లింది.

''నాన్నా''

''ఏంటమ్మా?''

''నాన్నా! నాకు ఇక్కడ జాబ్ ఉందికదా. తమ్ముడు, నేను ఇక్కడే ఉంటాం. నువ్వు అమ్మను తీసుకుని గుంటూరులో వుండు. మనోహర్ చాలా వర్రీ అవుతున్నాడు నాన్నా'' అంది శ్రావణి.

''వర్రీ అవుతున్నది వాడా? నువ్వా?'' అడిగాడు రఘురామ్ సూటిగా.

శ్రావణి తడబడింది.

''వాడే నాన్నా. వాడి ఫ్రెండ్స్ అంతా ఇక్కడే ఉన్నారు''

''గుంటూరుకెళ్తే అక్కడా ఫ్రెండ్స్ అవుతారు. నాకు మొదట్లో గుంటూరులోనే ఫ్రెండ్స్ అంతా ఉండేవాళ్లు. జాబ్ వచ్చాక ఇక్కడికొచ్చాను. ఇక్కడా ఫ్రెండ్స్ తయారయ్యారు''

''అదికాదు నాన్నా. నా జాబ్?'' నీళ్లు నమిలింది శ్రావణి.

''నీ జాబ్ ఏమైనా స్టేట్‌గవర్నమెంటు జాబా? సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగమా? ప్రైవేటు కాలేజీలో లెక్చరర్ జాబ్. అంతేగా. నీకేం మేథ్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్‌వి. గుంటూరులో లెక్కలేనన్ని ప్రైవేటు కాలేజీలున్నాయి. నా ఫ్రెండ్‌దే ఒక కాలేజీ ఉంది. అక్కడ చేరిపోదువుగానీ. జాబ్ గురించి వర్రీకాకు'' చెప్పాడు రఘురామ్.

శ్రావణి ముఖంలో అసంతృప్తి తొలగిపోలేదు. తల్లివైపు బేలగా చూసింది. రఘురామ్ తన పనిలో మునిగిపోయాడు. తండ్రి మాటలు ఆమెకు ఏమాత్రం రుచించలేదని పార్వతి గ్రహించింది.

కొంచెంసేపుఆగిన తరువాత రఘురామ్ తల్లీకూతుళ్లవైపు చూసి చిన్నగా నవ్వాడు.

''చూడమ్మా! రెండు కుటుంబాలు నడపడం వల్ల డబ్బు ఖర్చవుతుందని నేను వర్రీ కావడంలేదు. తమ్ముడు చిన్నవాడు, నువ్వు వయసులో వున్నావు. పెద్దవాళ్లు లేకుండా మీరిద్దరూ ఉండడం ఏమాత్రం మంచిదికాదు. ఏమంటావు పార్వతీ'' అన్నాడు రఘురామ్.

పార్వతి మాత్రం ఏమంటుంది? ఆయన చెప్పినదాంట్లో ఎంతో నిజం

ఉందికదా? రోజులు ఏమాత్రం బాగాలేవు. పిల్లల్ని వదిలి వెళ్లడం మంచిదికాదుకదా''

"ఔనండీ'' అన్నది.

"నాన్నా...నేను'' శ్రావణి చెప్పడం ఆపింది.

రఘురామ్ సీరియస్‌గా చూసాడు కూతురివైపు.

"ఊ... నువ్వు? చెప్పు ఆగిపోయావేం?'' అన్నాడు.

"మా కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్ చైతన్యని ప్రేమిస్తున్నాను. మేమిద్దరం పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాము'' తల వంచుకుని తడబడుతూ చెప్పింది శ్రావణి.

"అదన్నమాట అసలు సంగతి? ఎప్పట్నించి ప్రేమించుకుంటున్నారు?'' కోపంగా అడిగాడు రఘురామ్.

"సంవత్సరంపైనే''

"సంవత్సరం పైనే ఎన్నో నెలల నుంచి ప్రేమించుకుంటున్నారు. సినిమాలకి, షికార్లకి తిరుగుతున్నారు. రెస్టారెంట్లలో పిజ్జాలు, ఐస్‌క్రీమ్‌లు తింటున్నారు. కానీ ఇంట్లో అమ్మానాన్నలకి చెప్పడానికి తీరిక నీకు దొరకలేదు. అవునులే ఇక నీకు మా అవసరం ఏముంది. నువ్వుకూడా సంపాదిస్తున్నావు. అంతేకదా... ఏం? మిమ్మల్ని చూసిన ఇరుగుపొరుగువాళ్లు, మా ఆఫీసులో కొలీగ్స్ నాకు చెప్పాలి. 'మీ శ్రావణి ఎవరో కుర్రాడితో తిరుగుతున్నదే... ఎవరు అతను?' అని అడుగుతుంటే మేము నోళ్లు వెళ్లబెట్టిపిచ్చి ముఖాలు వేసుకుని చూడాలి. అంతేనా? ఇదేనా నువ్వు తల్లిదండ్రులకు ఇచ్చే గౌరవం'' కేకలు పెట్టాడు రఘురామ్.

శ్రావణి కళ్ల వెంట నీళ్లు జరజరా జారాయి.

"సారీ నాన్నా... నాదే తప్పు'' అంది.

"ప్రేమించుకోవడం తప్పుకాదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న వెంటనే ఇంట్లో పెద్దవాళ్లకి చెప్పాలనే విషయం నీకెందుకు తట్టలేదో నాకు అర్థం కావడంలేదు. మన ఇంటి విషయం వూళ్లో ఎవరి ద్వారానో వినాల్సి రావడం ఎంతో బాధాకరమైన విషయమో నీకు ఇప్పుడు అర్థంకాదు'' అన్నాడు రఘురామ్ సీరియస్‌గా.

శ్రావణికి కన్నీళ్లు ఆగడంలేదు. చిన్నప్పటి నుంచీ తండ్రి తనను చిన్న మాట కూడా అనలేదు. ఆ అవసరం కూడా తను రానివ్వలేదు. తండ్రి ఇంతగా మందలించడం ఆమె జీవితంలో ఇదే మొదటిసారి.

పార్వతికి కూతురి పరిస్థితి చూసి జాలి కలిగింది. వయసులో వున్న ఆడ, మగ ఒక చోట కలిసిమెలిసి పని చేస్తున్న పరిస్థితుల్లో ఒకరిపట్ల మరొకరికి ఆకర్షణ కలగడం సహజమే.

కానీ భర్త చెప్పినట్లు బైటవాళ్లు మీ అమ్మాయిని ఎవరో అబ్బాయితో సినిమా హాల్లో చూసాననో, పార్కులో కనబడిందనో చెప్తే ఎంత బాధగా వుంటుంది? కూతురు ప్రేమ వ్యవహారం వాళ్ల ద్వారా, వీళ్ల ద్వారా తెలిసినా డైరెక్టుగా అడగకుండా ఆమె నోటితోనే తన ప్రేమ విషయం చెప్పించిన భర్తని మెచ్చుకుంది పార్వతి.

"అసలు సంగతేమిటంటే నాకు గుంటూరు ట్రాన్స్‌ఫర్ కాలేదు'' గంభీరంగా చెప్పాడు రఘురామ్.

పార్వతి "ఆ...'' అంటూ నోరెళ్లబెట్టింది.

"రియల్లీ..'' అంటూ మనోహర్ ఎగిరి గంతులేసాడు. వాడి ఆనందానికి హద్దులులేవు.

శ్రావణి తండ్రివైపు ఆశ్చర్యంతో చూసింది. తండ్రి ఏం చెబుతున్నాడో ఆమెకు అర్థంకాలేదు.

"యస్ శ్రావణీ! నీ ప్రేమ గొడవ నీతోనే చెప్పించాలని ట్రాన్స్‌ఫర్ నాటకం ఆడాను'' అని నవ్వాడు రఘురామ్.

"మరి గుంటూరు వెళ్లి వస్తున్నారుగా?'' అడిగింది పార్వతి.

"ఆఫీసు ఇనస్పెక్షన్‌కి'' చెప్పాడు.

"సారీ నాన్నా'' అంది శ్రావణి నవ్వు ముఖంతో. ఆమె ముఖం మతాబాల వెలిగిపోతోంది.

"ఎంత నాటకం ఆడారండీ'' బుగ్గలు నొక్కుకుంది పార్వతి.

"సంవత్సరం నుండి ప్రేమ వ్యవహారం నడిపిస్తూ మనకి తెలియకుండా నాటకం ఆడలేదూ నీ కూతురు'' అన్నాడు రఘురామ్.

"ఏమండీ! ఆ అబ్బాయిని ఓసారి చూడాలని ఉందండీ'' అంది పార్వతి.

"ఏం? అప్పుడే అల్లుడ్ని చూడాలనిపిస్తోందా? శ్రావణీ! వచ్చే ఆదివారం వాళ్లింటికి వస్తున్నామని చైతన్యతో చెప్పు. ఏం'' అన్నాడు రఘురామ్.


"అలాగే నాన్నా...'' అంది శ్రావణి సిగ్గుపడుతూ.

ఈ విషయం చైతన్యతో చెప్పడానికి సెల్ తీసుకుని డాబా మీదకు పరుగెత్తింది.

★

## స్మార్ట్ డాగ్

మనుషులే కాదు సాధన చేస్తే కుక్కలు కూడా ఉవ్వెత్తున లేచే సముద్ర కెరటాల మీద స్కేటింగ్ చేయజాలవని నిరూపిస్తుంది మూడేళ్ల 'గోల్డెన్ రిట్రీవర్' డాగ్. దీని పేరు 'సెయింట్'. దీనికిలా ట్రైనింగ్ ఇవ్వటానికి యజమానులు మూడు నుంచి ఐదువేల డాలర్లు ఖర్చు పెడతారట. తర్వాత అది ఎక్కడికేనా వెళ్లి తప్పిపోతే వెదకటానికి సెటిలైట్ సిగ్నల్స్‌ని ట్రేక్ చేసే సెన్సర్లని దాని శరీరానికి ఫిక్స్ చేస్తారుట.



-తటవర్తి

